క్లుప్తంగా

ప్రత్యేక పూజలు..



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీబీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌లోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం స్వాతిన క్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు అర్చకుడు భార్గవ లక్ష్మీనరసింహస్వామి తెలిపారు. సోమవారం ఉదయం శ్రీలక్ష్మీనరసింహస్వామికి ఫల పంచామృత అభిషేకం, శ్రీహోమం, రాత్రి 7గంటలకు కల్యాణమహోత్సవం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

29న బోనాల పండుగ

– ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్ చెరు: డివిజన్ పరిధిలో 29న బోనాల పండుగ నిర్వహించేందుకు నిర్ణయించినట్లు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. ఆదివారం కోదండ సీతారామస్వామి ఆలయంలో నిర్వహించిన ప్రముఖుల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. బోనాల పండుగను పురస్కరించుకొని డివిజన్ పరిధిలోని అమ్మవారి ఆలయాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. భక్తులకు అనుగుణంగా అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజలందరూ భక్తి శ్రద్ధలతో బోనాల పండుగను నిర్వహించుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మాజీ జెడ్పీటీసీ జైపాల్, మాజీ కార్పొరేటర్ శంకర్ యాదవ్, గూడెం మధుసూదన్ రెడ్డి, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

సేవల్లో ముందుండాలి



జ్ఞాపిక అందజేస్తున్న ఎమ్మెల్యే

నారాయణఖేడ్: సేవా కార్యక్రమాల్లో ఖేడ్ లయన్స్ క్లబ్ ముందుండాలని ఎమ్మెల్యే, స్థానిక లయన్స్‌క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు డా.పట్లోళ్ల సంజీవరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక సాయిబాబా ఫంక్షన్‌హాలులో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. క్లబ్ చేస్తున్న సేవలను కొనియాడారు. క్లబ్ మాజీ జిల్లా గవర్నర్లు జనార్దన్‌రెడ్డి, రవీందర్ గౌడ్, దిగంబర్‌రావు పాటిల్, టీపీసీసీ సభ్యులు మున్నూరి కిషన్, మెదక్ జిల్లా రేగోడు మాజీ జెడ్పీటీసీ యాదగిరి తదితరులను సన్మానించారు. స్థానిక బాధ్యుడు వెంకటరావు, మన్మథకిషోర్, చంద్రశేఖర్, రాజు, పండరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల పాదయాత్ర



పాదయాత్రగా వెళ్తున్న కార్మికులు

పటాన్‌చెరు టౌన్: మాజీ ఎమ్మెల్సీ టీపీసీసీ ఉపాధ్యక్షుడు రాములు నాయక్‌కు కార్మికశాఖ మంత్రి పదవిని ఇవ్వాలని సువిన్ యూనియన్ తరపున కార్మికులు పాదయాత్ర నిర్వహించారు. ఆదివారం స్థానిక మహంకాళి అమ్మవారికి ఆ యూనియన్ నాయకులు, కార్మికులు ప్రత్యేక పూజలు నిర్వహించి పాదయాత్రగా గణేశ్ గడ్డ దేవస్థానానికి బయలుదేరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సత్యనారాయణ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, రాము, రాజు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా శ్రమదానం



పార్కును శుభ్రంచేస్తున్న యువకులు, పిల్లలు

నారాయణఖేడ్: పట్టణంలోని జర్నలిస్టు కాలనీకి ఎదురుగా ఉన్న పార్కులో ఆదివారం కాలనీకి చెందిన మాజీ జెడ్పీటీసీ లక్ష్మీబాయి, జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ మాజీ సభ్యుడు రవీందర్ నాయక్, కాలనీ యువకులు, పిల్లలు శ్రమదానం నిర్వహించారు. పార్కులో పెరిగిన పొదలు, పిచ్చిమొక్కలు, చెత్తను తొలగించారు. సిమెంటు బెంచీలను శుభ్రం చేశారు. మొక్కలకు నీళ్లు పోశారు. వరదనీరు పార్కులోకి రాకుండా అవసరమైన చర్యలు చేపట్టారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పార్కును మరింత అభివృద్ధి చేయాలని కాలనీవాసులు కోరారు.

గుట్కా స్వాధీనం?

మునిపల్లి(అందోల్): గుట్కా పాకెట్లు, మత్తు పదార్థాలు తరలిస్తున్న డీసీఎం వ్యానును బుదేరా పోలీసులు పట్టుకున్నట్లు తెలిసింది. ఆదివారం కంకోల్ టోల్‌గేట్ సమీపంలో వాహనాల తనిఖీలో భాగంగా స్వాధీనం చేసుకున్నట్టు తెలిసింది.

మా గోడు పట్టించుకోండి

బీసీ హాస్టల్ విద్యార్థుల ఆందోళన
- ఖాళీప్లేట్లతో నిరసన
- ఉదయం టిఫిన్ పెట్టడం లేదు
- సిబ్బంది అందుబాటులో ఉండరు



ఖాళీ ప్లేట్లు చూపుతూ హాస్టల్ ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థులు

హత్నూర(సంగారెడ్డి): ''సార్లూ.. మా గోడు పట్టించుకోండి''అంటూ బీసీ హాస్టల్ విద్యార్థులు ఖాళీ ప్లేట్లతో ఆందోళన చేపట్టారు. మండల కేంద్రమైన హత్నూరలో ఆదివారం బీసీ సంక్షేమ వసతిగృహం విద్యార్థులు 9:30అవుతున్నా టిఫిన్ పెట్టడం లేదని హాస్టల్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. హాస్టల్‌లో ఎవరూ అందుబాటులో లేరని, ఓ మహిళ మాత్రం వచ్చి పాలు అందించిందని విద్యార్థులు తెలిపారు. మెనూ ప్రకారం ఆదివారం ఇడ్లీ, సాంబార్ పెట్టాల్సి ఉండగా కనీసం ఎలాంటి టిఫిన్ పెట్టలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వారంలో ఒకసారి మాత్రమే గుడ్లు ఇస్తున్నారని విద్యార్థులు పేర్కొన్నారు. హాస్టల్లో మొత్తం 80మంది విద్యార్థులు ఉండగా వివిధ కారణాలవల్ల కొంతమంది ఇంటికి వెళ్లగా ఇంకా 30మంది ఉన్నామని వారు తెలిపారు. తెచ్చేవారు ఎవరూ లేకపోవడంతో తామే చికెన్ దుకాణానికి వెళ్లి మూడు కిలోల చికెన్ తెచ్చుకున్నట్లు చెప్పారు. విధులకు ఎగనామం పెడుతున్న సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. 11గంటలకు విషయం తెలుసుకొని సిబ్బంది హాస్టల్‌కు చేరుకున్నారు. ఈ విషయమై సాక్షి వివరణ కోరగా పొరపాటు జరిగిందని, తిరిగి ఇలాంటి పొరపాటు జరగనివ్వమని చెప్పుకొచ్చారు.

రోజూ మేమే శుభ్రపరచాలి



సిబ్బంది సక్రమంగా ఉండకపోవడంతో మేమే రోజూ హాస్టల్‌ను శుభ్రపరచుకుంటున్నాం. స్వచ్ఛభారత్ పేరుతో ప్రతిరోజు బాత్రూమ్‌లు, పరిసరాలను శుభ్రం చేయిస్తున్నారు. చేయకపోతే కొడుతున్నారు. దయచేసి అధికారులు మాగోడు పట్టించుకోవాలి.

– సుశాంత్, హాస్టల్ విద్యార్థి

భోజనం సక్రమంగా పెట్టడం లేదు



హాస్టల్లో సమయానికి భోజనం అందించడం లేదు. అది కూడా సరిగా ఉండదు. సిబ్బంది కూడా అందుబాటు ఉండడంలేదు. మేమే వడ్డించుకోవాల్సిన దుస్థితి నెలకొంది. రోజూ చింతపండు పులిసే పెడుతున్నారు. గుడ్లు కూడా ఇవ్వడం లేదు.

– రాఘవ, హాస్టల్ విద్యార్థి

సిబ్బందిపై చర్యలు తీసుకుంటాం

విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలి. హత్నూర బీసీ సంక్షేమ వసతి గృహంలో నెలకొన్న సమస్యలపై పూర్తిస్థాయిలో విచారణ చేపడతాం. సక్రమంగా విధులు నిర్వహించని సిబ్బందిపై చర్యలు తీసుకుంటాం.

– భాగ్యలక్ష్మి, జిల్లా బీసీ సంక్షేమ సహాయఅధికారి

ప్రమాద నివారణకు సేఫ్టీ మోకులు

కల్లుగీత కార్మిక సంఘం నేత

మునిపల్లి(అందోల్): కల్లుగీత కార్మికులకు ప్రమాద నివారణ కోసం సేఫ్టీ మోకులు, ఇతర సామగ్రిని సీఎం రేవంత్‌రెడ్డి పంపిణీ చేయడం అభినందనీయమని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రమేశ్‌గౌడ్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న కల్లుగీత కార్మికులందరికీ కూడా అందజేయాలని కోరారు. ఈ పరికరాలు అందుబాటులో లేకపోవడంతో కల్లుగీత కార్మికులు సంవత్సరానికి సుమారు 500మందికి పైనే ప్రమాదంలో మృతి చెందుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. యాదగిరి గుట్టలో బీసీ సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్ర వెంకటేశం చొరవతో ఈ సేఫ్టీ మోకులు రూపొందించారని చెప్పారు. తమ సంక్షేమం కోసం కృషి చేసిన పొన్నం ప్రభాకర్, ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, టాడీ కార్పొరేషన్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

నారాయణఖేడ్‌లో..



రమేశ్‌గౌడ్

కల్లుగీత వృత్తిలో ప్రమాదాల నివారణకు సేఫ్టీ మోకులను ముఖ్యమంత్రి లష్కర్ గూడలో పంపిణీ చేయడం హర్షణీయమని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అంజాగౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఖేడ్‌లో గౌడ కులస్తులకు ఆదర్శప్రాయుడైన సర్దార్ సర్వాయి పాపన్న చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. పలువురు సంఘం నాయకులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

పటాన్‌చెరు టౌన్: చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం గత నెల 30న గుర్తు తెలియని వ్యక్తి మూర్చతో పడిపోతే స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. ఆ సమాచారం తెలుసుకున్న పోలీసులు అతనికి సంబంధించిన వారు ఉంటే తమను సంప్రదించాలని పోలీసులు ప్రకటించారు. ఈ క్రమంలో చికిత్స పొందుతున్న ఆ గుర్తుతెలియని వ్యక్తి శనివారం మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. మృతుడికి సంబంధించిన బంధువులు ఉంటే తమను సంప్రదించాలని పోలీసులు కోరారు.

గుండె పోటుతో రైతు..



శంకరప్ప(ఫైల్)

కల్హేర్(నారాయణఖేడ్): గుండె పోటుతో రైతు మృతి చెందిన ఘటన మండలంలోని మార్డిలో జరిగింది. గ్రామానికి చెందిన ముత్యపు శంకరప్ప(40) ఆదివారం ఉదయం తీవ్ర గుండెనొప్పికి గురయ్యాడు. కుటుంబ సభ్యులు ఆయనను కామారెడ్డి జిల్లా పిట్లం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో మరణించాడు. శంకరప్పకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మృతుడి తండ్రి బస్వరాజ్ పాటిల్‌ను డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి పరామర్శించారు. శంకరప్ప మృతితో గ్రామంలో విషాదం నెలకొంది.

సెక్యూరిటీ గార్డు..



శివకుమార్ (ఫైల్)

జహీరాబాద్: మండలంలోని బూచనెల్లి గ్రామ శివారులోని మంగళ ట్యూబ్ పరిశ్రమలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్న శివకుమార్(60) గుండెపోటుతో మరణించినట్లు కార్మికులు తెలిపారు. కర్మాగారంలో ఆదివారం టిఫిన్ చేస్తున్న క్రమంలో అస్వస్థతకు గురయ్యాడని, ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందినట్లు వారు చెప్పారు. శివకుమార్ మృతదేహాన్ని యాజమాన్యం శాంతినగర్‌లోగల అతడి స్వగృహానికి తరలించారు. విషయం తెలుసుకున్న కార్మిక నేత రాములు, కార్మికులు కర్మాగారం వద్ద ఆందోళన చేశారు. మృతుడి కుటుంబానికి పరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

భారీవర్షం.. రైతుల హర్షం



నారాయణఖేడ్: రోడ్డుపై పారుతున్న వరదనీరు

నారాయణఖేడ్: ఖేడ్ ప్రాంతంలో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. అరగంటకు పైగా కురిసిన వర్షానికి పట్టణంలోని రాయిపల్లి, మంగల్‌పేట్ ప్రధాన రహదారి వెంట వరదనీరు ప్రవహించింది. రాజీవ్ కూడలి ప్రాంతం జలమయమైంది. మంగల్‌పేట్‌తోపాటు బసవేశ్వర చౌక్ ప్రాంతాల్లో మురుగుకాల్వల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు బయటకు రావడంతో శానిటరీ అధికారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులు శుభ్రం చేశారు. పంటలు ఎండుముఖం పట్టిన తరుణంలో ఈ వర్షం కురవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

జహీరాబాద్ :

పక్షం రోజులుగా వర్షాల కోసం ఎదురు చూస్తున్న రైతులకు ఆదివారం కురిసిన వర్షం ఎంతో ఊరటనిచ్చింది. జూన్ మొదటి వారంలో కురిసిన వర్షాలతో రైతులు సంతోషించి విత్తనాలు వేసుకున్నారు. తీరా వర్షాలు ముఖం చాటేయడంతో పెసర, మినుము, కంది, పత్తి, సోయాబీన్ పంటలు వాలిపోయే స్థితికి వచ్చాయి. దీంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. ఆదివారం సాయంత్రం ఒక్క సారిగా ఆకాశం మేఘావృతమై మోస్తారు వర్షం పడడంతో సాగులో ఉన్న పంటలకు ఊపిరిపోసినట్లయిందని రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

క్రషర్‌ల నివారణ కోసం జేఏసీ

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని మాదారం గ్రామ శివారులోని కంకర క్రషర్‌లతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, ఈ క్రషర్‌లను ఇక్కడి నుంచి తొలగించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు తీర్మానించారు. అందుకు సంబంధించిన జేఏసీని మాజీ సర్పంచ్ సురేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. కమిటీ చైర్మన్‌గా విజయ్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా ఆరేందర్‌గౌడ్, భాస్కర్, ప్రధాన కార్యదర్శిగా రమణసింగ్, అనిల్‌కుమార్, కోశాధికారులుగా మహేందర్‌గౌడ్, గణేశ్, సలహాదారులుగా మహస్తష్, వీరేశ్, కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నిక చేశారు. గ్రామంలోని ప్రజలందరి సలహాలు తీసుకుంటూ కమిటీ ముందుకు సాగుతుందని చైర్మన్ విజయ్‌గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు శ్రీనివాస్, నర్సింగ్‌రావు, బాబు, ప్రసాద్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు సన్మానం



విద్యార్థులతో చంద్రశేఖర్‌రెడ్డి

నారాయణఖేడ్: మనూరు మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన నలుగురు విద్యార్థులు బాసరలోని ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. వారిని ఆదివారం ఖేడ్‌లో ఎమ్మెల్యే సంజీవరెడ్డి స్వగృహంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించి కోరారు. కాంగ్రెస్ నాయకులు వెంకట్ నాయక్, చందర్, సుధాకర్, అనిల్, దావీద్ తదితరులు పాల్గొన్నారు.



నీరు నిలిచిన బూచినెల్లి రోడ్డు

బురదమయం..

జహీరాబాద్ టౌన్: నియోజకవర్గంలోని పలు గ్రామాల రోడ్లు దెబ్బతిని అధ్వానంగా తయారయ్యాయి. మండలంలోని బూచినెల్లి రోడ్డు పూర్తిగా దెబ్బతిని గుంతలమయంగా మారింది. బూచినెల్లి గ్రామం కర్ణాటక సరిహద్దులో ఉంటుంది. జాతీయ రహదారి నుంచి కర్ణాటక బోర్డర్ వరకు ఉన్న పంచాయతీరాజ్ రోడ్డు దశాబ్దాల క్రితం వేశారు. అప్పటి నుంచి మరమ్మతులు లేక గుంతలు పడింది. గుంతల కారణంగా వర్షకాలంలో నీరు పేరుకుని రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ప్రజలు వాపోతున్నారు.



అసంపూర్తి రోడ్డు ఇదే

అసంపూర్తి దారి..

జిన్నారం(పటాన్‌చెరు): ఏడాదిన్నరగా రోడ్డు పనులు అసంపూర్తిగా ఉండడంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలం కావడంతో రోడ్డుపై మరిన్ని గుంతలు ఏర్పడుతున్నాయి. గుమ్మడిదల నుంచి అనంతారం మీదుగా కానుకుంట వరకు డబుల్ రోడ్డును వేయించేందుకు ఏడాదిన్నర క్రితం ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. రూ.1.50కోట్లు మంజూరు కాగా మరో రూ.7.50కోట్ల సీఎస్ఆర్ నిధులు కేటాయించి పనులు చేపట్టారు. రెండు వైపులా గుంతలు తీసి మట్టి పోసి వదిలేశారు. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

బోనం.. ఘనం



నారాయణఖేడ్: పూజలు చేస్తున్న ఎమ్మెల్యే



జహీరాబాద్‌లో పోతురాజుల నృత్యాలు

వట్‌పల్లి(అందోల్): ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని అందోలు మండల పరిధిలోని నేరడిగుంట చౌరస్తాలో వ్యాపారస్తులందరూ కలిసి బోనాల పండగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దుకాణ సముదాయాల నుంచి బోనాలను డప్పు వాయిద్యాల నడుమ పోతులరాజుల విన్యాసాలతో దుర్గాభవాని మాత ఆలయం వరకు ఊరేగింపుగా తీసుకువెళ్లారు. అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించి మహిళలు మొక్కులు చెల్లించుకున్నారు. పోతురాజు వేషధారకులతో యువకులు నృత్యాలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కృష్ణగౌడ్, మల్లప్ప, మాజీ ఉప సర్పంచ్ నాగప్ప, శ్రీధర్‌రెడ్డి, డాక్టర్ మచ్చేందర్, ఆర్.ఆంజనేయులు, కృష్ణ, నిఖిల్‌రెడ్డి, శేఖర్‌గౌడ్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

నారాయణఖేడ్: మనూరు మండలం బోరంచ నల్ల పోచమ్మ ఆలయంలో కొలువైన అమ్మవారికి ఆషాఢం మాసం సందర్భంగా ఆదివారం విశేషపూజలు నిర్వహించారు. హైదరాబాదుకు చెందిన భక్తులు ఇస్తారి పురుషోత్తం, శివకుమారి, రత్నం అర్చకుడు సిద్దుస్వామి ఆధ్వర్యంలో అమ్మవారికి వెండి బోనం సమర్పించారు. ఈ సందర్భంగా వారిని అమ్మవారి పట్టువస్త్రాలతో సత్కరించారు. అంతకు ముందు ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి, అటవీశాఖ కన్సర్వేటర్ కృష్ణ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఉత్సాహంగా..

జహీరాబాద్: పట్టణంలోని సాయినగర్ కాలనీలోని పోచమ్మ ఆలయంలో బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో సాయిరాం, దత్తగిరి కాలనీలకు చెందిన మహిళలు బోనాలు తీశారు. పోతురాజులు నిర్వహించిన ప్రదర్శనలు అందరినీ అలరించాయి. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

కోహీర్‌లో..

జహీరాబాద్: కోహీర్‌లోని భీంనగర్ కాలనీలోగల మారెమ్మ, పోచమ్మ దేవాలయాలకు మహిళలు బోనా లు తీశారు. ఆదివారం సాయంత్రం కాలనీ ప్రజలు ఇంటింటి నుంచి అమ్మవారికి బోనాలు తీసి, నైవేద్యాలు సమర్పించుకున్నారు. ఈ సందర్భంగా అన్నదానం నిర్వహించారు. ఉత్సవంలో కాలనీ వాసులు పాల్గొన్నారు.

పస్తాపూర్‌లో...

మండలంలోని పస్తాపూర్ గ్రామంలో గల ఊరడమ్మ దేవాలయానికి ప్రజలు బోనాల ఉత్సవాలు నిర్వహించారు. ఉత్సవాల్లో గ్రామ ప్రజలు పాల్గొని దర్శించుకున్నారు. రాష్ట్ర సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ ఎస్.గిరిధర్‌రెడ్డి, జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఎస్.ఉజ్వల్‌రెడ్డి పాల్గొని అమ్మవారిని మొక్కుకున్నారు.

ముత్యాల పోచమ్మకు..

కంగ్టి(నారాయణఖేడ్): మండలంలోని తడ్కల్ గ్రామంలో ఆదివారం ముత్యాల పోచమ్మకు మహిళలు బోనాలు తీశారు. ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పిండి వంటలతో నైవేద్యాలు సమర్పించారు. సాయంత్రం డప్పు వాయిద్యాలతో నిండు కలశాలను తలపై మోసుకొని గ్రామం నుండి ఆలయం వరకు ఊరేగింపుగా వెళ్లారు. నిండు కలశాలపై జ్యోతులు వెలిగించి ఆలయం వద్ద ప్రదక్షిణలు వేశారు. కార్యక్రమంలో స్థానిక పెద్దలు, రైతులు పాల్గొన్నారు.



కంగ్టి:ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు



కోహీర్‌లో..



వట్‌పల్లి(అందోల్): ఊరేగింపుగా తీసుకువెళ్తున్న భోనాలు

'అందోల్' రోడ్లను హైవేలుగా గుర్తించండి



కిషన్‌రెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న జోగినాథ్

జోగిపేట(అందోల్): అందోల్ నియోజకవర్గంలోని మెదక్–బొడ్మట్‌పల్లి, అల్లాదుర్గం– మెటల్‌కుంట రోడ్లను జాతీయ రహదారులుగా గుర్తించి అభివృద్ధి చేయాలని జోగిపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జి.జోగినాథ్ కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌ను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లాదుర్గం–మెటల్‌కుంటకు మధ్య 44కి.మీ దూరం ఉంటుందని, ఈ రోడ్లను నాలుగు లేన్లుగా అభివృద్ధి చేయాలని మంత్రులకు అందజేసిన వినతిపత్రంలో కోరినట్లు తెలిపారు. ఈ రోడ్లను జాతీయ రహదారులుగా అభివృద్ధి చేస్తే ఉమ్మడి జిల్లాలోని సిద్దిపేట, మెదక్, దుబ్బాక, నారాయణఖేడ్, నర్సాపూర్ ప్రాంతాలు, కర్ణాటక, మహరాష్ట్ర ప్రాంతాలకు వెళ్లేందుకు కూడా ఉపయోగపడుతుందని ఆయన చెప్పారు. తన వినతిపై మంత్రులు సానుకూలంగానే స్పందించారని, కేంద్రం మంత్రి నితిన్‌గడ్కరీ దృష్టికి తీసుకువెళ్లి నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. మెదక్ లోకసభ నియోజకవర్గం పరిధిలోకి వస్తున్నందున ఎంపీ రఘునందన్‌రావు, మాజీ ఎంపీ బీబీపాటిల్ దృష్టికి కూడా తీసుకువెళ్లినట్లు జోగినాథ్ చెప్పారు. మంత్రులను కలిసేందుకు సహకరించిన నారాయణఖేడ్ బీజేపీ నాయకులు సంగప్ప, ఇతర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

వరుణుడి కరుణ కోసం పూజలు



హోమం చేస్తున్న తండావాసులు

నారాయణఖేడ్: వరుణుడు కరుణించి సమృద్ధిగా వర్షాలు కురిపించాలని కోరుకుంటూ మండలంలోని శ్యామానాయక్ తండాలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం రాథోడ్ కిషన్ నాయక్ ఆధ్వర్యంలో తండాలోని భవానీమాత, సేవాలాల్ మహారాజ్ ఆలయాల ఎదుట హోమం చేసి, వర్షాలు కురిపించి పంటలు మంచిగా పండాలని వేడుకున్నారు. ఉదయం పూజలు నిర్వహించగా మధ్యాహ్నం భారీ వర్షం కురవడంతో తండావాసులు పూజలు ఫలించాయని సంతోషం వ్యక్తం చేశారు.

పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టాలి

మునిపల్లి(అందోల్): పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టాలని తీన్మార్ మల్లన్న టీం రాష్ట్ర కమిటీ సభ్యుడు రమేశ్ యాదవ్ డిమాండ్ చేశారు. మండలంలోని కంకోల్‌లో ఆదివారం ఆయన మాట్లాడుతూ 50శాతం రిజర్వేషన్ సౌకర్యం కల్పించాలన్నారు. వెనుకబడిన బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లు ఇవ్వాలని, బీసీల జనాభా ప్రకారం 27శాతం నుంచి 56శాతానికి పెంచాలని కోరారు. ఖాళీగా ఉన్న ఉద్యోగాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే భర్తీ చేయాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

మునిపల్లి(అందోల్): కంకోల్ ఎస్సీ బాలుర వసతి గృహంలో 30సీట్లు ఖాళీగా ఉన్నాయని హాస్టల్ వార్డన్ దుర్గేశ్ ఆదివారం తెలిపారు. 3వ తరగతి నుంచి 8వ తరగతి వరకు విద్యార్థులకు హాస్టల్‌లో ఉండి చదువుకోవడానికి మంచి అవకాశం ఉందన్నారు. 135 మందికి గాను ప్రస్తుతం 105 మంది హాస్టల్‌లో చేరారని మరో 30మందికి సీట్లు ఉన్నాయని తెలిపారు.

ఎస్‌ఐలకు అభినందనలు

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ ఎస్‌ఐగా బాధ్యతలు చేపట్టిన డి.వెంకట్‌రెడ్డిని మాజీ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, మాజీ ఆత్మ చైర్మన్ రాంసింగ్ ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువా కప్పి సన్మానం చేశారు. అనంతరం వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో శాంతిభద్రతల కోసం సహకరించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సంజీవరావు, మాజీ సర్పంచ్ సాయాగౌడ్, సత్యనారాయణగౌడ్, కాంగ్రెస్ నాయకులు కుర్మ హన్మండ్లు పాల్గొన్నారు.

జహీరాబాద్ టౌన్ :

పదవీ విరమణ చేసిన ఎస్‌ఐ నర్సింహులును ఆదివారం ముదిరాజ్ సంఘం నాయకులు సన్మానించారు. పట్టణానికి చెందిన ఆయన జహీరాబాద్, వికారాబాద్ తదితర ప్రాంతాల్లో విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను సంఘం నాయకులు కొనియాడారు. కార్యక్రమంలో బరూర్ దత్తాత్రి, పలువురు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.